క్లుప్తంగా

కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

తెలకపల్లి: సాంకేతిక పరిజ్ఞానంతోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎల్ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజామహేందర్‌రెడ్డి, డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఎల్ఆర్ విద్యాసంస్థలలో వేసవిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా నెల రోజులు ఈ తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని స్టేడియం గ్రౌండ్ ఆవరణలో శనివారం మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ ప్రారంభించారు. అండర్–14, 16, 19 బాలురు, బాలికలకు శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు సుధాకర్ తెలిపారు.

నేడు మాంసం దుకాణాలు బంద్

కల్వకుర్తి టౌన్: మహవీర్ జయంతి సందర్భంగా పట్టణంలోని అన్ని మాంసం దుకాణాలను ఆదివారం బంద్ చేయాలని మున్సిపల్ కమిషనర్ అక్షిత్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఆదేశాలను ఎవరైనా ధిక్కరిస్తే వారి దుకాణాన్ని సీజ్ చేయటంతో పాటుగా, మున్సిపల్ చట్టం ప్రకారం తగు చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెబుతారు

కల్వకుర్తి టౌన్: పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న రెండు పార్లమెంట్ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ విజయాన్ని సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఇచ్చిన గ్యారంటీలు అమలు చేస్తుందని పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

తాడూరు: మండల కేంద్రంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ జ్యోతిపరోసియా శనివారం ప్రారంభించారు. కార్యదర్శి పవన్, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఏపీఓ చంద్రసిద్ధార్థ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల సందర్శన

కల్వకుర్తిరూరల్: మండలంలోని సుద్దకల్, తురుకలపల్లి లో శనివారం ఎంపీడీఓ వెంకట్రాములు పర్యటించారు. సుద్దకల్ అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం ఇతర విషయాలను చర్చించారు. కేంద్రంలోని చిన్నారులతో మాట్లాడి పలు విషయాలపై టీచర్‌ను ప్రశ్నించారు. అనంతరం పాఠశాలకు వెళ్లి విద్యార్థుల ప్రతిభను తెలుసుకున్నారు. నర్సరీని పరిశీలించారు.

పత్తాలేని పార్టీల ప్రచారం

బల్మూర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారం మండలంలో ఇప్పటి వరకు పత్తా లేకపోవడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి నియోజవర్గంలోని అమ్రాబాద్, వంగూర్, చారగొండ, ఉప్పునుంతల, అచ్చంపేట మండలాల్లో ఇప్పటికే ప్రచారం ప్రారంభించగా బల్మూర్ మండలంలో ఇంకా ప్రారంభించలేదు. బీజేపీ అభ్యర్థి భరత ప్రసాద్, ఆపార్టీ నాయకులు కూడా మండలంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించకపోవడంతో క్యాడర్ కూడా స్తబ్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ఇప్పటి వరకు మండలంలో ఎన్నికల ప్రచారంపై కనీసం సన్నాహక సమావేశం కూడా ఏర్పాటు చేయక పోవడం, ముఖ్య నేతలంతా ఇటీవల పార్టీ మారడంతో మండలంలో పార్టీ ఆనవాలు లేకుండా పోయాయి. ఇతర మండలాల్లో ఇప్పటికే ఆయా పార్టీల తరపున నాయకులు ఎన్నికల ప్రచారాలతో గ్రామాల్లో తిరుగుతున్నా మండలంలో మాత్రం ఎక్కడ కూడా కనిపించడం లేదు. పోలింగ్‌కు మూడు వారాల గడువే మిగిలి ఉన్నా, పార్టీలు తమ ప్రచారాలను మొదలు పెట్టకపోవడంపై మండలంలో పార్టీల కార్యకర్తలు, ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లో ఉన్న చెక్‌పోస్టు వద్ద నిత్యం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. శనివారం చెరువుకొమ్ము లింగమయ్య స్వామి సమీపంలోని అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ పోలీసులు తనిఖీ చేపట్టారు. అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, ఎస్ఐలు రమేష్, ఖాద్రీల సూచన మేరకు సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు.

లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ ఎంపిక

నాగర్‌కర్నూల్‌రూరల్: లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్‌గా జిల్లా కేంద్రానికి చెందిన తెప్ప శ్రీను ఎంపికయ్యారు. శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ 8వ కన్వెన్షన్, గవర్నర్ కోటేశ్వర్‌రావుల సమక్షంలో 7వ జోన్ రీజియన్ చైర్మన్ ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

కల్వకుర్తిరూరల్: లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఎక్స్‌లెంట్ అవార్డు లభించింది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్ కార్యక్రమంలో అవార్డును క్లబ్ అధ్యక్షుడు రమేష్‌కు, రఘు అందజేశారు.

సాగని డబుల్‌రోడ్డు పనులు

- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- రోడ్డుపై కంకరవేసి వదిలేసిన వైనం



పెద్దకొత్తపల్లి నుంచి పస్పుల వద్ద నిలిచిపోయిన డబుల్ రోడ్డు పనులు

కోడేరు: ప్రభుత్వం ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు డబుల్ రోడ్లను మంజూరు చేసింది. రోడ్ల పనులతో తమకు కష్టాలు తీరుతాయని ప్రజలు భావించినప్పటికీ అనుకున్న విధంగా పనులు సాగడం లేదు.

పెద్దకొత్తపల్లి నుంచి కోడేరు వరకు 9 కిలోమీటర్లకు 2015–16లో రూ.13కోట్ల50లక్షలు మంజూరయ్యాయి. 2018లో పనులు ప్రారంభించి కొంత వరకు చేసి అలాగే వదిలేశారు. రెండు నెలల క్రితం పనులు ప్రారంభమైన నత్తనడకనే సాగుతున్నాయి. అలాగే కోడేరు నుంచి నాగులపల్లి వరకు డబుల్ రోడ్డుకు రూ. 753లక్షలు 2022–23 సంవత్సరంలో నిధులు మంజురుయ్యాయి. నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించిన మొదట్లో వేగవంతంగా జరిగినా తర్వాత మందగించాయి. నర్సాయిపల్లి ఎక్స్ రోడ్డు నుంచి చెన్నారం వరకురూ. 30 కోట్లు మంజూరుయ్యాయి. నాగులపల్లి నుంచి ఎత్తం వరకు రూ.10.7 కోట్లు 2016–17లో నిధులు మంజూరురైనా కంకర వేసి అలాగే వదిలివేశారు. ఎక్కడ కూడా డబుల్ రోడ్లు పనులు పూర్తి కాక పోవడంతో వాహనదారులు కంకర రోడ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం నాగర్‌కర్నూల్, వనపర్తి, పెద్దకొత్తపల్లి వివిధ పనుల కోసం వెళ్తుంటారు. ఇప్పటికైన ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి నిలిచిపోయిన రోడ్ల పనులను పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



పెద్దకొత్తపల్లి నుంచి కోడేరు వరకు డబుల్ రోడ్డుకు కంకర వేసి వదిలేశారు. తేలిన కంకరతో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు నడపాలంటే ఇబ్బందులు పడుతున్నాం. కొందరికి వాహనంపై నుంచి పడి గాయాలైన సందర్భాలు ఉన్నాయి. అధికారులు స్పందించి పనులను ప్రారంభించాలి.

– రామకృష్ణ, కోడేరు

పనులు కొనసాగుతున్నాయి

మండలంలో డబుల్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. డామర్ లేకపోవడం వల్ల పనులు ఆగిపోయాయి. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకుంటాం.

– రవి, ఏఈఈ ఆర్‌అండ్‌బీ

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



భూగర్భ కేంద్రం ఫైర్, సేఫ్టీ సిబ్బందిని అభినందిస్తున్న ఎస్ఈ ఆదినారాయణ

నాగర్‌కర్నూల్ క్రైం: అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిసినట్లు ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన పెంచుకోవాలన్నారు.

దోమలపెంట: టీఎస్ జెన్‌కో పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రం సేఫ్టీ, ఫైర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు శనివారం ముగిశాయి. కేంద్రం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్ఈ (ఓఅండ్ఎం) ఆదినారాయణ మాట్లాడుతూ.. వారోత్సవాలను ఆచరణలో విజయవంతంగా పూర్తి చేశామన్నారు. విద్యుత్ సిబ్బందితో పాటు విద్యార్థులకు, దోమలపెంట గ్రామస్తులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన, చైతన్యం కలిగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సేఫ్టీ అధికారి డీఈ శ్రీకుమార్‌గౌడ్, ఎస్ఎఫ్ఓ మల్లికార్జున, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ సూర్యరావు, ఫైర్, సేఫ్టీ సిబ్బందిని అభినందించారు.

పొల్కమ్మారులో పూజలు ప్రారంభం

తాడూరు: మండలంలోని పొల్కమ్మారులో సీతారామాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో మొదటిరోజు శనివారం పూజలు నిర్వహించారు. యజ్ఞాలు, అగ్నిప్రతిష్ఠాపన, వేదపారాయణాలు, పంచగవ్య ప్రోక్షణ, పున్యవాచన, రక్షబంధన కార్యక్రమాలను చేపట్టారు. ఈ నెల 24 వరకు పూజలు కొనసాగుతాయని 24న త్రిదండి చిన్నజియర్ స్వామి పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

తెలకపల్లి: మత్స్యకార సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సాగాలని బేసిక్స్ ప్రైవేట్ కమిటీ మేనేజర్ వికాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మత్స్యకార్మిక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. చెరువులలో చేపలను నాణ్యతగా పెంచుకోవాలని సూచించారు. ప్రతి సంఘానికి ఆర్థికంగా బలపడేందుకు మా సంస్థ నుంచి పథకాలను మంజూరు చేసేందుకు దోహదపడుతుందన్నారు. ఏ ఒక్కరు నష్టపోకుండా, చేపల పెంపకంలో మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. అనంతరం చేపల మార్కెట్‌ను సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. గ్రామంలోని పెద్ద చెరువును పరిశీలించి ఎప్పుడు చేపలు వదలాలి, ఎలా పెంచాలి అనే విషయంపై సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దేశియోద్దీన్‌షైమర్, నర్సింహ, సత్యనారాయణ, బాలయ్య, సత్తి, మల్లేష్, జంగం తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



చేపల మార్కెట్‌ను పరిశీలిస్తున్న సంస్థ ప్రతినిధులు

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

వంగూరు: గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. మండలంలోని డిండిచింతపల్లి, సర్వారెడ్డిపల్లితండా, పోతారెడ్డిపల్లి గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిని తీర్చాలని అధికారులను సూచించారు. కొత్త బోర్లు వేసేదానికంటే అగ్రికల్చర్ బోర్లు లీజుకు తీసుకోవాలని తెలిపారు. రెండు నెలలు ప్రజల దాహార్తిని తీర్చగలిగితే యథావిధిగా తాగు, సాగునీరు అందించగలుగుతామని వివరించారు. అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడంతోపాటు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆయన అధికారులను తెలిపారు. పనిచేసే ప్రదేశంలో తాగునీరు, టెంట్లువేసి నీడ కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబించవద్దని ప్రజా అవసరాలు తీర్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలన్నారు. వరిధాన్యం కొనుగోలులో ఎలాంటి అవకతవకలు కాకుండా చూడాలని మండల వ్యవసాయాధికారి తనూజారాజుకు సూచించారు. సమావేశంలో ఎంపీపీ భీమమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కేవీఎస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్, డీటీ వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయండి..

23న నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారని, సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి నామినేషన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. అదేవిధంగా ఆదివారం అచ్చంపేటలో యూత్‌కాంగ్రెస్, బూత్‌సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నామని సమావేశానికి మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు పార్టీ నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. సమావేశానికి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, బూత్‌కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

పార్టీకి తీరని లోటు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలానికి చెందిన సీపీఐ నాయకుడు, ఫ్రూట్ అసోసియేషన్ సభ్యుడు ఎండి సిరోద్దీన్ అకాల మరణం పార్టీకి తీరని లోటని రాష్ట్ర సమితి సభ్యుడు ఆనంద్ అన్నారు. శనివారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ ఆశయాల కోసం నిరంతరం కృషి చేశారని, పండ్లు అమ్ముకుంటూ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారన్నారు.

సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌మన్ సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను గిరిజన గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని సింగారంలోని ఎస్టీ కాలనీలో సిద్ధాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చందాపూర్ సబ్‌సెంటర్ ఆరోగ్య కార్యకర్తలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుస్మిత, ఆశావర్కర్ ఇందిరమ్మ, గిరిజనులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు చెందిన బండి రాముడు, సింగోటం చెందిన గొల్ల శ్రీను అనారోగ్యానికి గురికాగా శనివారం మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. వారికి మనో ధైర్యం కల్పించారు.

అదుపు తప్పిన డీసీఎం



తాడూరు: మండలంలోని అల్లాపూర్ గేటు వద్ద శనివారం ఉదయం నాగర్‌కర్నూల్‌లోని వరిధాన్యం బస్తాలతో కల్వకుర్తికి వెళ్తున్న డీసీఎం అదుపుతప్పి కిందపడడంతో బస్తాలు రోడ్డు పాలయ్యాయి.

అభయారణ్యంలో అకాల వర్షం

మన్ననూర్: నల్లమల అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నంలో మోస్తరు వర్షం కురిసింది. కొన్ని రోజులుగా ఎండలు మండుతున్నాయి. దీంతో ప్రజలు ఉదయం 9 గంటలు అయ్యిందంటే ఆరుబయట తిరుగలేకపోతున్నారు. ఈ క్రమంలో మన్ననూర్‌తో పాటు అటవీ ప్రాంతం ఫరహాబాద్, పుల్లాయిపల్లి, అప్పాపూర్, రాంపూర్‌తో పాటు సలేశ్వరం పరిసర ప్రాంతం మొట్ల కురువ ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఇదిలా ఉండగా ఎండలు అధికంగా ఉండడంతో సలేశ్వరం ఉత్సవాలకు ఎలా వెళ్లాలి అనుకునే వారికి ప్రకృతి సహకరించి అటవీ ప్రాంతం అంతా చల్లబడింది.

సామూహిక వ్రతాలు



బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తులు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య దంపతులు ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సామూహిక వ్రతాలు నిర్వహించడం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

తరలిన నాయకులు

వెల్దండ: రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ సభకు మండలంలోని ఆయా గ్రామాల నాయకులు తరలివెళ్లారు. ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శేఖర్, మధుసూధన్‌రెడ్డి, భాస్కర్‌రావు, రాజునాయక్ ఉన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న జయశంకర్

నాగర్‌కర్నూల్‌రూరల్: దేశాన్ని పాలిస్తున్న పాలకులు రాష్ట్రంలో కొన్ని పార్టీల స్వభావం రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నాయని అందుకు ఏ పార్టీ కొమ్ము కాసిన తగిన గుణపాఠం చెబుతామని జిల్లా పొలిటికల్ జేఏసీ చైర్మన్ జయశంకర్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో దళిత రాజకీయ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మతతత్వ బీజేపీ, రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగాన్ని మారుస్తామని చేసిన ప్రకటనకు వత్తాసు పలకడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. త్వరలోనే మా కార్యాచరణను ప్రారంభించి భారీ బహిరంగ సభ ద్వారా ఎవరికి మద్దతు ప్రకటించాలో తెలియజేస్తామని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సూర్యనారాయణ, జెట్టి తిరుపతయ్య, జోగు జ్యోతి, యాదగిరి ఉన్నారు.

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాల నుంచి ఈ ఏడాది 2024–25 విద్యా సంవత్సరానికి ఏడుగురు విద్యార్థులు 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభను చాటారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపికైన విద్యార్థుల్లో మురళి, అరవింద్, ప్రవీణ, వరలక్ష్మి, పల్లవి, సిరి, అక్షర ఉన్నారు. ఉన్నత లక్ష్యంతో చదివి భవిష్యత్‌లో గొప్ప స్థాయికి చేరాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బాలమణి, శ్రీనివాసులు, వెంకటేష్, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాల నుంచి ఆరుగురు..

లింగాల: మండలంలోని అవుసలికుంట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో వివిధ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికై ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన విద్యావేత్త శ్రావణ్‌కుమార్ పాఠశాలకు చెందిన 14 మందికి ఉచితంగా కోచింగ్ ఇచ్చి ప్రవేశ పరీక్ష రాయించారు. ఎంపికైన విద్యార్థులలో దండుగుల యశ్వంత్(జ్యోతిరావు పూలే అంబట్‌పల్లి), గద్ద వాసవి, ఆరాధ్య(సోషల్ వెల్ఫేర్ పాఠశాల వంగూరు), మన్యం సుస్మిత, మన్యం తేజస్విని(గురుకుల పాఠశాల కొల్లాపూర్), సాయిప్రసన్న(మన్ననూర్) పాఠశాలలో సీట్లు సాధించారు.



ఉప్పునుంతలలో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పోలింగ్ కేంద్రాలకు నంబర్ల కేటాయింపు

ఉప్పునుంతల: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఓటర్లకు ఇబ్బంది లేకుండా మండలంలో కొత్తగా ఏర్పాటుచేస్తున్న అనుబంధ పోలింగ్ కేంద్రాలకు శనివారం ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు నంబర్లు వేసే కార్యక్రమం చేపట్టారు. ఉప్పునుంతల పంచాయతీ పరిధిలోని గట్టుకాడిపల్లి, రంగంపేట, కొత్తరాంనగర్‌లో కొత్త పోలింగ్ కేంద్రాలకు నంబర్లు వేయించారు. ఇంతకుముందున్న కేంద్రాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల్లో ప్రస్తుతం కొత్తగా అనుబంధ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. కొత్తగా ఏర్పాటుచేసే కేంద్రాల్లో చాకలి గుడిసెలు, సీబీతండా, పూర్యతండా, ఈరట్వానిపల్లి, తిప్పాపూర్, కాంసానిపల్లితండా, గట్టుకాడిపల్లి, రంగంపేట, గుట్టమీదితండా, కొత్తరాంనగర్ ఉన్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

శ్రీశైలం విద్యుదుత్పత్తి కేంద్రం సందర్శన



విద్యుదుత్పత్తి కేంద్రం వద్ద విద్యార్థులు

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శ్రీశైలం సమీపంలోని జెన్‌కో కేంద్రాన్ని శనివారం సందర్శించారు. శ్రీశైలం డ్యాం ద్వారా నీటి వినియోగం, విద్యుదుత్పత్తి, విద్యుత్ సరఫరా, నిల్వ వంటి అంశాలను వారు తిలకించారు. విద్యుదుత్పత్తి వివరాలను పవర్ జెనరేషన్ సిబ్బంది వారికి తెలియజేశారు. క్షేత్రస్థాయి విషయాలపై అవగాహన పెంపొందించేందుకు తీసుకెళ్లినట్లు ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ తెలిపారు.

పుస్తక పఠనం అలవరుచుకోవాలి

కల్వకుర్తి టౌన్: ప్రతి విద్యార్థి తను పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని మానవత ఫౌండేషన్ చైర్మన్ డా.రమ్య అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాలలో ఫౌండేషన్ తరపున కళాశాలలో ఉన్న గ్రంథాలయానికి మరింతగా మెరుగుపరిచి, రూ.35వేల విలువ గల పుస్తకాలను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చాలామంది నిరుపేద విద్యార్థులు పుస్తకాలను కొని చదవలేని పరిస్థితి ఉందని, వారందరికి ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని వారి జీవితంలో ఉన్నతలక్ష్యాలను చేరుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శార్వాణి, అధ్యాపకులు, ఫౌండేషన్ వలంటీర్లు సందీప్, మురళీ, ప్రవీణ్, శ్రీరామ్, శ్రీమాన్, అనిల్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ఫౌండేషన్ చైర్మన్ రమ్య

వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి



వృద్ధులకు మందులు అందిస్తున్న రెడ్‌క్రాస్ అధికారులు

బిజినేపల్లి: వృద్ధాప్యంలో ఉన్న వారికి దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా ఉంటాయని, వారు అప్రమత్తంగా ఉండాలని యూత్ రెడ్ క్రాస్ జిల్లా కమిషనర్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లింగసానిపల్లిలో వృద్ధులకు సంచార వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయని, వేసవిలో వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కుమార్, వైద్య సిబ్బంది పద్మ, యాదమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శనేశ్వరునికి ప్రత్యేక పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌కి చెందిన శనేశ్వరునికి ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తిలతైలాభిషేకాలతో ఆదిపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఒక్కొక్కరి చేత తిలతైలాభిషేకం పూజలు చేపిస్తూ.. వారి చేత గోత్రనామార్చన, మంత్రోచ్ఛరణ చేయించారు. శివుడి దర్శనం అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజలు చేస్తున్న భక్తులు

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలుపించుకుందాం



పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకుందామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన నాలుగు నెలలకే కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలకు నమ్మకం పోయిందని, ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగా నెరవేర్చలేకపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, సురేందర్‌గౌడ్, విజయరామారావు, ఖాజా, రామకృష్ణ, రఫియోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



కల్వకుర్తి టౌన్: నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాము, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రవికాంత్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేయాలని వారు పిలుపునిచ్చారు. మంగళవారం రోజున జిల్లాలోని బిజినేపల్లిలో నిర్వహించే ముఖ్యమంత్రి ఎన్నికల సభకు పార్టీ కార్యకర్తలతో పాటుగా యూత్‌కాంగ్రెస్ నాయకులు కదం తొక్కాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో అనిల్, బాలరాజు, సురేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

లింగాల: దేశంలో సుస్థిర పాలన బీజేపీతో సాధ్యమవుతుందని ఎంపీ రాములు అన్నారు. నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరతప్రసాద్‌కు మద్దతుగా శనివారం ఎంపీ మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వ్యాపారులతో కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మంగ్యానాయక్, రేణయ్య, వెంకటశెట్టి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని నాయకులు శనివారం రాకొండలో ఇంటింటి ప్రచారం కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, దేశంలో ఏ పథకాలు అమలు అవుతున్నాయో ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నరేంద్రాచారి, ఖాదర్, రజియా, రాజు, జగనాచారి, పార్థు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



తెలకపల్లి మండలం రాకొండలో ప్రచారం చేస్తున్న నాయకులు